# ఆశ్చర్యం

రచన :
శ్రీ జి. వి. ప్రసాద్

'నవ్వీనవ్వీ చస్తావనుకో!'

'ఒరేయ్ కాదూ! ఈకథ చదివితే నువ్వు ఏడ్చేడ్చి చస్తావనుకో!'

సంతోషంగానీ, 'బుజ్జి'గాడి కథల్లా దేవి విలాస్ యిడ్లెన్నుకూడా బావుండవనుకో!'

ఆ...పోనిద్దూ 'నాని' రాసినట్టు మరో కూడు రాయలేడనుకో! ఆఁ! నానిగాడి కథకి అయ్యరుహోటల్లో సాంబారుకూడా సాటిరాదనుకో!'

నిద్రపోతున్న సూరి వీరిమాటలు విన్నాడో లేదోగాని నోరు చప్పరించాడు. ఎందుకో!?

'బుజ్జిగాడే బాగా రాస్తాడు' సత్తిగాడి ఉవాచ.

'నానిగాడే బాగా రాస్తాడు' విస్సుగాడి ఉక్రోషం.

'కాదు బుజ్జి'

'కాదు నాని'

'కాదంటూంటే'

'నేనూ డిటో అంటున్నారా నాగన్నా!'

'అసలు బుజ్జిగాడు ఒట్టి 'వెధవ'' విస్సుగాడు.

'(వడ్డీ!) నానిగాడు వెర్రివెధవ' సత్తిగాడి కోపం కట్టలు తెంచుకుంది.

'పిచ్చివెధవ!'

'జడ్డివెధవ!'

............

............

ఇలా వారిదూషణల పరంపర నిరాఘాటంగా సాగిపోతోంది.

ఇంతలో సూరిలేచి మొహం కడుక్కుని రిహార్సల్‌కి తయారయ్యేడు. వాడి రిహార్సల్‌కి కూడా మరొకటైము దొరకదనుకున్నాడేమో!

ఊపిరి బిగపట్టాడు!

'నా నరనరాల్లో రక్తం మరుగుతోంది. భాయీ, భాయీ అంటూ...?తరువాత చెప్ప వలసిందేమిటో మర్చిపోయాడు. ఓసారి కాగితం చూసుకున్నాడు.

'భాయీ భాయీ అంటూ దొంగవ్రేటు వేసిన మిత్రద్రోహి చైనావాణ్ణి...చైనావాణ్ణి కాల్చిపారేస్తాను! నిజంగానే కాల్చిపారేస్తాను!'

మరోసారి కాగితం చూసుకున్నాడు.

'అవిగో...ఫిరంగుల ప్రేల్పులు...అవిగో ...శతఘ్నుల మ్రోతలు!'

ఈవిధంగా సాగిపోతోంది సూరిగాడి ఏక పాత్రాభినయం రిహార్సల్.

ఇటుప్రక్క వీళ్ళిద్దరు దెబ్బలాట సాగుతూనే ఉంది.

'బుజ్జిగాడు దొంగవెధవ!'

'నానిగాడు జడ్డువెధవ!'

'చైనావాణ్ణి కాల్చి పారేస్తాను!'

ఈసారి విస్సుగాడు ఊరుకున్నాడు. గబగబా సూరిగాడిదగ్గరకు వెళ్ళేడు.

'ఒరేయ్! సూరీ!' వాడి భుజాలు పట్టుకున్నాడు విస్సు. 'తర్వాతెప్పుడో చైనావాడ్ని ఖాల్చొచ్చుగానీ, మొదట...మొదట ఆ బుజ్జిగాడు...ఆ గ్నాడే...వాణ్ణి ఖాల్చిపారేయ్!'

'ఉర్రే! సూర్యుడూ! మొదట ఆ నానిగాడ్ని ఖాల్చేయ్! మొన్న సినిమాకి డబ్బు లివ్వలేదు

వరో జ్ఞాపకం ఉంచుకో!' అంటూ బెదిరించాడు సత్తిగాడు.

'ఒరేయ్! సన్యాసి వెధవా! మొన్న నేను సిగరెట్టు మానుకొనికూడా నీకివ్వలేదూ?'

సూరిగాడు వీళ్ళిద్దరివైపూ ఒక్క క్రీగంటి చూపైనా విసరలేదు. 'చైనావాడ్ని కాల్చేస్తా'నంటూ వాడిగోల వాడిదే తప్ప వీళ్ళిద్దర్నీ వినిపించుకోలేదు వాడు.

ఇక యిలా లాభం లేదనుకున్నాడు విస్సిగాడు. గబగబా వెళ్ళి బుజ్జిగాడు రాసిన కథ తాలూకు కాగితాలన్నీ ముక్కలుగా చేసి కిటికీలోంచి బైటకి విసిరేశాడు.

'హా...హ్హా...హ్హా...హ్హో' అంటూ నోరు వెళ్ళబెట్టేడు.

సత్తిగాడి ఒళ్ళు మండిపోయింది. వెంటనే వెళ్ళి 'నాని' గాడి కథ తాలూకు కాగితాలన్నీ ముందేసుకు కూర్చొని అగ్గిపుల్ల ముట్టించేడు.

'హు...హ్హు...హ్హు...హ్హూ' అని పళ్ళికిలించేడు సత్తి.

ఇంతలో అగ్గిపుల్ల ఆరిపోయింది.

రెండో అగ్గిపుల్ల ముట్టించేడు. అది ఆరిపోలేదుగాని విస్సిగాడు దానిని ఆర్పేశాడు.

మూడో అగ్గిపుల్ల...

నాలుగో అగ్గిపు...

అయిదో అగ్గి...

అలా అగ్గిపుల్లలు అన్నీ వెలిగించేశాడు. విస్సిగాడు ఆర్పేశాడుకూడా.

ఇక గతిలేక విస్సిగాడు చేసినపనే చేశాడు సత్తి. అయితే కొంచెం ఎక్కువ ముక్కలుగా చింపేడు. అంతే తేడా.

అంతే.

మళ్ళా తిట్టుకోవడం మొదలెట్టారు.

మరికొంతసేపటికి అంతా కలిసిపోయింది.

'బుజ్జిగాడిసి చం...శతఘ్నుల మోత... నాని వెధ...నిజంగానే కాల్చే...బుజ్జిగాడు జిడ్డువె...నరనరాల్లో రక్తం...నాసిగా...'

ఇంతట్లో ఇంటాయన పరుగుపరుగున ఒగర్చుస్తూ వచ్చేడు. 'ఆగండి'

ఫిరంగి పేలినట్టయింది.

సత్తిగాడు ఫిరంగి పేలిందనుకున్నాడు.

సూరిగాడు నిజంగానే శతఘ్నులు పేలుతున్నాయనుకున్నాడు.

విస్సిగాడు ఇంటాయనే పేలిపోయాడనుకున్నాడు.

ముగ్గురినోళ్ళూ స్విచ్ ఆఫ్ చేసినట్టు ఆగిపోవడంలో ఆశ్చర్యపడాల్సిందేం లేదు.

విస్సిగాడు ఇంటాయన్ని చూసి అతను పేలిపో లేదని విచారించాడు.

సత్తిగాడు ఇంటాయన్ని చూసి, ఏమీ పేలిపోలేదని తెలుసుకొని స్థిమితపడ్డాడు.

సూరిగాడు ఇంటాయనే చైనావాడు కానందుకు భోల్డు ఆనందపడిపోయాడు.

ఈపిల్లలకి తనదగ్గర ఉన్న భయానికి ఆ యింటాయన చాలా...చాలా సంతోషించి, ఆనందపడిపోయాడు.

ఆ ఇంటాయన ఐస్ అయిపోయాడు వీళ్ళ వినయానికి. ఐసేమిటి! అతని టెంపరేచరు -48 సెంటీగ్రేడు ఉష్ణోగ్రత దిగిపోయింది!!!

'ఏంబాయ్! మీగావు కేకలకి మాయింటి పెంకులన్నీ రాలిపోతున్నాయి. మళ్ళా ఎవడు వేయిస్తారనుకున్నారు?!' అని మృదుస్వరంతో పలికి తనొక బ్రహ్మాండమైన విక్టీసేసుకొని

నవ్వులకోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు.

వెంటనే వాళ్ళు ముగ్గురూ రాలిపోయిన పెంకులన్నీ జాగ్రత్తగా ఏరి కుప్పగాపోసి, ఆ యింటాయన ఎదుట చేతులుకట్టుకొని, సిగ్గుతో నుగ్గయిపోతూ, అందంగా, చంతంగా, ముద్దుగా, బొద్దుగా చిరునవ్వు లొలకపోస్తూ నిలబడ్డారు.

ఆ పెద్దమనిషి ఓర్నీయిల్లు తగలబడా! అని అనబోయి తనయిల్లే అని జ్ఞాపకంవచ్చి నాలు కర్చుకున్నాడు.

ఇంటాయన మౌనంగా కదిలేడు.

సూరిగాడు క్రీగంటిచూపులు చూసేడు.

విస్సుగాడు కుర్చీలో కూలబడ్డాడు.

దూర్వాసుడు కోపం దిగమ్రింగుకున్నాడు.

మౌనంగా గదికి తాళంవేసి బయలుదేరారు.

ఎక్కడికి ? ఏవిధమున ? ఎందుకు ?

హోటలుకి. క్షుధాకలితమానసులై, తిండానికి

*　　*　　*　　*

హోటలులో ముగ్గురూ కూర్చున్నారు.

టిఫిన్లు ఆరగిస్తున్నారు.

సగం తింటూ, తింటూ 'నానిగాడి నూని వెధవ' అన్నాడు సత్తిగాడు ఏదో బ్రహ్మాండమైనవిషయం జ్ఞాపకం వచ్చిన వాడిలా.

వాళ్లిద్దరూ ఫకాలున, భళ్ళున నవ్వుతారనుకొన్న సత్తిగాడికి వాళ్ళిద్దరూ ఏడుపు మొహాలు పెట్టేసరికి ఆశాభంగమయింది.

ఆ టిఫినుప్లేట్లు రెండూ తీసుకొని వాళ్ళ ముఖాలమీద ఫెడేమని కొడదామనిపించింది.

ఇంతలో విస్సుగాడు 'బుజ్జిగాడుబజ్జీ'అంటూ బజ్జీని కసిదీరా నమిలేసాడు.

'అదికాదు గానీ...అసలు నానిగాడికి అక్షరం ముక్క చింపుతే పొట్టముక్కకూడా రాదుట తెలుసా!' అన్నాడు తడబడుతూ సత్తి.

విస్సుగాడు బజ్జీతినడంలో పూర్తి నిమగ్నమైయున్నాడు.

*　　*　　*　　*

ఆ తర్వాత కొన్నాళ్ళకి సూరిగాడు 'డ్రమటిక్' ఎసోసియేషన్ సెక్రెటరీగా ఎన్నిక అవలేదని తెలిసి వీళ్ళిద్దరు ఆశ్చర్యపడలేదు గానీ బుజ్జి, నానిపేర్లతో కథలు వ్రాసేవాడు ఒక మానవుడే అని తెలిసినతర్వాత బోలెడు ఆశ్చర్యపడి...పోవడంలో ఆశ్చర్యం లేదు.

మళెప్పుడైనా కలుసుకుందాం! సెలవ్!

ఆశ్చర్యపోకండి!

'సుగుణసుందరి కథ'

శ్రీ పింజాల సుబ్బారావు, బి. ఎస్, ఆర్. ఫిల్మ్స్ బ్యానర్ క్రింద తయారించే 'సుగుణసుందరి కథ' చిత్రం పూర్తయింది. త్వరలో విడుదలవుతుంది. ఇందులో కాంతారావు, రామకృష్ణ, సత్యనారాయణ, త్యాగరాజు, మిక్కిలినేని, విజయలలిత, దేవిక, శోభాలత, పుష్పకుమారి మొదలగువారు నటిస్తున్నారు.

ఛాయాగ్రాహకుడు:- పాల్. ఎస్. సేను. సంగీతం:- ఎస్. పి. కోదండపాణి. రచన:- చిల్లర భావనారాయణ. గీతాలు:- నారాయణ రెడ్డి, కొసరాజు, ఆత్రేయ. దర్శకుడు:- కె. ఎస్. రావు.

మేము....

పెరిక్ ఎంబోస్ట్ శుభలేఖలు, మల్టీకలర్ పెళ్ళిపత్రికల డిజైన్లు, చెక్ బుక్కులు, బిల్లు బుక్కులు, ఇన్‌లెండ్ లెటర్ కార్డ్సు, బిల్లు కవర్సు, మొదలగు ఇతర రకముల లేబులు తయారించుచున్నాము.

వివరములకు

ది ప్రిమియర్ అడ్వర్టైజింగ్ ప్రెస్ కంపెనీ.

పో. బా. నెం: 112; : శివకాశి (S.I)